కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

హుజూర్‌నగర్‌లో లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనారవి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 7 : కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ గెల్లి అర్చనా రవి అన్నారు. బుధవారం తాసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన 56 కల్యాణలక్ష్మి, 10 షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, తాసీల్దార్ నాగార్జునరెడ్డి, కౌన్సిలర్లు సౌజన్య, సంపత్‌రెడ్డి, రాంగోపి, గురువయ్య పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్య కల్యాణం

కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, ఫిబ్రవరి 7 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని అర్చకులు బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు చేసి వేద మంత్రోచ్చరణ నడుమ పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణతంతు జరిపించారు. కార్యక్రమంలో దేవాలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

త్యాగమూర్తి రమాబాయి అంబేద్కర్

● బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నవీన్

గరిడేపల్లి : డప్పు కళాకారులను సన్మానిస్తున్న బీఎస్పీ నాయకులు

గరిడేపల్లి, ఫిబ్రవరి 7 : పేదల బతుకుల గురించి ఆలోచించిన త్యాగమూర్తి రమాబాయి అంబేద్కర్ అని బీఎస్పీ నియోజకర్గ ఇన్‌చార్జి రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం రమాబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక పూట తిని, ఒక పూట తినక నగదును కూడబెట్టి అంబేద్కర్ పైచదువుల కోసం ఇచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అనంతరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీ పరేడ్‌లో డప్పు వాయించిన మహిళలు అమరవరపు అనూరాధ, చిలక సంధ్య, నన్నెపంగు రమణ, మాస్టర్ అమరవరపు సతీశ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.ఉపేందర్, నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కె.నర్సింహారావు, అధ్యక్షుడు జిలకర రామస్వామి, మహిళాధ్యక్షురాలు కృష్ణవేణి పాల్గొన్నారు.

నేరేడుచర్ల : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాతా రామాబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు యడవల్లి అరుణ్, టౌన్ ప్రధాన కార్యదర్శి ఇంజమూరి వెంకన్న, కాంతయ్య, రవి, వెంకటేశ్, లక్ష్మణ్, కార్తీక్, బ్రహ్మం, వీరబాబు, గురువయ్య పాల్గొన్నారు.

పాలకవీడులో సాగర్ కాల్వను పరిశీలిస్తున్న ఎంపీపీ గోపాల్

చివరి భూములకు నీరు అందేలా చూడాలి

● ఎంపీపీ గోపాల్

పాలకవీడు, ఫిబ్రవరి 7 : ఆయకట్టులోని చివరి భూములకు సాగర్ నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని ఎల్-10, ఎల్-14 కాల్వలను ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మోతీలాల్, ఎంపీటీసీ ఉపేందర్ పాల్గొన్నారు.

శివాలయంలో వస్తు విక్రయ హక్కులకు వేలం

మేళ్లచెర్వు : వేలం నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 7 : స్థానిక స్వయంభూ శంభు లింగేశ్వరస్వామి ఆలయంలో మార్చి 8 నుంచి 12 వరకు మహా శివరాత్రి జాతర జరుగనున్నది. ఈ సందర్భంగా కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర ప్రసాదం అమ్ముకునే హక్కుతో పాటు కొబ్బరిచిప్పలు సేకరించుకునే హక్కు కోసం బుధవారం ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించారు. లడ్డు, పులిహోర ప్రసాదం అమ్ముకునే హక్కును గణపవరం గ్రామానికి చెందిన గాయం వినయ్‌రెడ్డి రూ.3.19 లక్షలకు దక్కించుకున్నాడు. గతేడాది కంటే రూ.59 వేలు అదనం. కొబ్బరికాయలు అమ్ముకునే హక్కుతో పాటు కొప్పరిచిప్పలు సేకరించుకును హక్కుకు సరియైన పాట రానందున వాయిదా వేశారు. కార్యక్రమంలో ఈఓ గుజ్జుల కొండారెడ్డి, అర్చకుడు కొంకపాక ధనుంజయశర్మ, సిబ్బంది కొండారెడ్డి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి జాతరకు వేలం

హుజూర్‌నగర్ : ఈ నెల 23న పట్టణ పరిధిలోని వేణుగోపాల సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగే జాతరకు ఐదు రోజుల పాటు తై బజార్, కొబ్బరికాయలు విక్రయించేందుకు బుధవారం వేలం పాటను నిర్వహించారు. తై బజారుకు రూ.50 వేలు, కొబ్బరికాయల విక్రయానికి రూ.30 వేలు వచ్చినట్లు ఆలయ ఈఓ కొండారెడ్డి తెలిపారు.

మేళ్లచెర్వులో వైద్య శిబిరం

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 7 : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వైఆర్‌జీ కేర్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హై రిస్క్ గ్రూప్‌లో ఉన్న వారిని గుర్తించి హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఐవీ సోకకుండా, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, ఏఎన్‌ఎంలు కళమ్మ, స్వరూప, నిర్వాహకులు సుజాత, రమాదేవి పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● ఎంపీపీ రవీందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : టేకుమట్లలో మురుగు కాల్వ శుభ్రం చేస్తున్న ఎంపీపీ రవీందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 7 : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. స్పెషల్ శానిటేషన్‌లో భాగంగా బుధవారం మండలంలోని టేకుమట్ల, ఎర్కారం గ్రామాల్లో మురుగు కాల్వను శుభ్రం చేసి మాట్లాడారు. తాళ్లకాంపాడ్, రాంమ్లాతండాల్లో పారిశుధ్య పనులను ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు పరిశీలించారు.

తిరుమలగిరి : మండలంలోని తొండ గ్రామంలో ఎంపీపీ స్నేహలత, ప్రత్యేక అధికారి ఎంపీఓ మారయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిరాల : మండల వ్యాప్తంగా వారం రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య పనులను గ్రామ పరిపాలన అధికారులు ప్రారంభించారు. వారం రోజుల పాటు గ్రామస్థుల సహకారంతో గుర్తించిన పనులు చేయడం జరుగుతుందని తెలిపారు.

అర్వపల్లి : మండలంలోని కుంచమర్తి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్ ప్రారంభించారు. అలాగే కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించి గ్రామంలో ర్యాలీ అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలూనాయక్, కార్యదర్శి నవీన్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ఏడుకొండలు, ఏఎన్‌ఎం నాగరాజు, మాజీ వార్డు సభ్యులు భాగ్యమ్మ, పరమేశ్, వీరస్వామి, బాలరాములు, సింహాద్రి పాల్గొన్నారు.

గరిడేపల్లి : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి కె.వనజ, పంచాయతీ సెక్రటరీ పి.సురేశ్ పాల్గొన్నారు.

మునగాల : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ ఈదయ్య అన్నారు. మండలంలోని రేపాలలో పారిశుధ్య కార్యక్రమాలను ఎంపీఓ భూపాల్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, మాజీ సర్పంచ్ పాల్గొన్నారు.

చిలుకూరు : చిలుకూరులో పారిశుధ్య కార్యక్రమాలను ఎంపీడీఓ ఈదయ్య పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, మాజీ సర్పంచ్ పాల్గొన్నారు.

నడిగూడెం వాసికి జస్వంత్ సింగ్ గిల్ మెమోరియల్ అవార్డు

అవార్డు అందుకున్న రామాపురం వాసి, కోల్ ఇండియా డైరెక్టర్ (టెక్నికల్) వీరారెడ్డి

నడిగూడెం, ఫిబ్రవరి 7 : కోల్ ఇండియా డైరెక్టర్ (టెక్నికల్), సీసీఎల్ (అడిషనల్ చార్జ్), నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన డాక్టర్ బూతూకూరి వీరారెడ్డి ప్రతిష్టాత్మకమైన జస్వంత్ సింగ్ గిల్ మెమోరియల్ అవార్డుకు ఎంపికయ్యారు. గనుల భద్రతలో ఉత్తమ సేవలకు గాను ఐఐటీ(ఐఎస్ఎం) ధన్‌బాద్ ఈ పురస్కారం ప్రదానం చేసింది. బుధవారం జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో గల సంస్థ క్యాంపస్‌లో జరిగిన ఐఐటీ(ఐఎస్ఎం) పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. ప్లానింగ్, ప్రొక్యూర్‌మెంట్ కార్యకలాపాలు, గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల స్థాపనతో సహా బొగ్గు గనుల రంగంలో వీరారెడ్డికి 36 ఏండ్ల అనుభవం ఉన్నది. అవార్డు స్వీకారం పట్ల ఎంపీపీ యాతాకుల జ్యోతీమధుబాబు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బూత్కూరి వెంకట్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ కోటిరెడ్డి, ప్రొగ్రెసివ్ జర్నలిస్ట్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగుల వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

యోగానందుడి ఆలయం చుట్టూ సీసీ నిర్మాణం

అర్వపల్లి, ఫిబ్రవరి 7 : అర్వపల్లి యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో భక్తులు ప్రదక్షిణలు చేసే ఆలయం చుట్టూ సుమారు రూ.5 లక్షల వ్యయంతో సీసీ నిర్మాణాన్ని పూర్తి చేశారు. సూర్యాపేటకు చెందిన మొరిశెట్టి లక్ష్యాది స్వచ్ఛందంగా సీసీ నిర్మాణం చేయించారు. దాంతో ఆలయ ప్రాంగణం కొత్త శోభను సంతరించుకున్నది

బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలి

● రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ

నడిగూడెం : సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ

నడిగూడెం, ఫిబ్రవరి 7 : కార్మిక, రైతుల వ్యతిరేక విధానాలను ప్రవేశపెడుతున్న బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు. మండలంలోని వేణుగోపాలపురంలో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫారస్సులు అమలు చేయాలని, నూతన కార్మిక చట్టాల ఆలోచనను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే సమ్మెలో కార్మికులు, రైతులు ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేరేడుచర్ల : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ఫ్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న చేపట్టే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి నీలా రాంమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి నాగినికి సమ్మె నోటీసు అందజేసి అనంతరం ఆశ వర్కర్ల సమావేశంలో మాట్లాడారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నూతనకల్ : మండల కేంద్రంలో దేశ వ్యాప్త సమ్మె పోస్టర్‌ను సీపీఎం జిల్లా నాయకుడు కందాల శంకర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరయ్య, రాఘవులు, సైదులు, ముత్తయ్య, అవిలయ్య, నాగన్న పాల్గొన్నారు.

12న నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

● మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి

నూతనకల్, ఫిబ్రవరి 7 : ఈ నెల 12న నిర్వహించే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలకు నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలను వేయించాలని సూచించారు. 1 నుంచి 6 ఏండ్ల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, 6 నుంచి 19 ఏండ్ల పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రలు వేయించాలని పేర్కొన్నారు.

సహజ సిద్ధ పద్ధతులతో వరిలో చీడపీడల నివారణ

● సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోపి

చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోపి

నడిగూడెం, ఫిబ్రవరి 7 : సహజ సిద్ధ పద్ధతులతో వరిలో ఆశించే చీడపీడలను నివారించవచ్చని సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరి గోపి అన్నారు. బుధవారం మండలంలోని వల్లాపురంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరి పంటలో కాండం తొలుచు పురుగు, ఆకు చుట్టు పురుగు, అగ్గి తెగులు ఆశించి పంటలను నష్టపరుస్తుందన్నారు. అయితే వేప ఆకుల, తూటికాడ, వావిలాకు కషాయం, ఆవు మూత్రం, ఇంగువ ద్రావణం, పుల్లటి మజ్జిగను పిచికారి చేసి వాటిని సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. అలాగే భూసారానికి జీవామృతం, ఘనా జీవామృతం ఉపయోగించాలన్నారు.

ధర్మకర్తల మండలి నియామకాలకు దరఖాస్తులు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 7 : మండలంలోని రేవూరు గ్రామంలో గల వేణుగోపాల, సిద్ధిలింగేశ్వర, ఆంజనేయ, రంగస్వామి దేవస్థాన దర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ కొండారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు నల్లగొండ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

మునగాల : మండలంలోని నేలమర్రి గ్రామంలో గల రామలింగేశ్వర రంగనాయక దేవాలయానికి, మాధవరం గ్రామంలో గల వేంకటేశ్వరస్వామి దేవాలయానికి ధర్మకర్తల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయ శాఖ మండల అధికారి వెంకటచలపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు నేటి నుంచి 25 రోజుల వ్యవధిలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

చింతలపాలెం : మండలంలోని చింత్రియాల గ్రామంలోని వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాలకు, అడ్లూరు గ్రామంలోని రామలింగేశ్వరస్వామి, వెల్లటూరు గ్రామంలోని పాపనాశేశ్వర స్వామి దేవస్థానాల ధర్మకర్తల మండలి నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయాల ఇన్‌చార్జి ఈఓ లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాలకు ఆయా గ్రామాల్లోని అర్చకులను లేదా 9949474038 నంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలి

● కోదాడ ఎంవీఐ బాబు

మేళ్లచెర్వు : జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభిస్తున్న కోదాడ ఎంవీఐ బాబు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 7 : వాహనాలు నడిపేవారు రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలని కోదాడ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ బాబు అన్నారు. స్థానిక మైహోం సిమెంట్స్ ఆవరణలో బుధవారం జరిగిన 35వ జాతీయ భద్రతా ముగింపు వేడుకలను ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పరిశ్రమ జీఎం నాగేశ్వర్‌రావు, సేఫ్టీ హెడ్ సూర్యనారాయణ, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

మద్దిరాల : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ మధునాయుడు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో వాహనదారులకు అవగాహన కల్పించి మాట్లాడారు. రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మఠంపల్లి : మైహోం సిమెంట్స్ పరిశ్రమ 35వ జాతీయ భద్రతా మాసోత్సవం ముగింపులో భాగంగా మండలంలోని చౌటపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారి వేణునాయుడు మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదాల నివారణకు పరిశ్రమ ఆధ్వర్యంలో తీసుకుంటున్న చర్యలు, రోడ్డుపై ప్రయాణించే వారు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రజా సేవ చేసే వారికి గుర్తింపు

● బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఉపేందర్

మాజీ సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఉపేందర్

అర్వపల్లి, ఫిబ్రవరి 7 : ప్రజా సేవ చేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ అన్నారు. బుధవారం పదవీ కాలం పూర్తి చేసుకున్న జాజిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ కుంభం ఉషారాణీనాగరాజు, వార్డు సభ్యులు గోగుల రామ్మూర్తి మమత, చింతల సురేశ్ దీపిక, చెన్నగాని యోగానందం, కమటం రాజును బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొప్పుల సోమిరెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

చిల్లేపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా రంగారెడ్డి

నేరేడుచర్ల, ఫిబ్రవరి 7 : మండలంలోని చిల్లేపల్లి ప్రాథమిక సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్‌గా గంట రంగారెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సహకార సంఘం చైర్మన్ అనంత్ శ్రీనివాస్‌గౌడ్ పదవికి రాజీనామా చేయడంతో జిల్లా సహకార సంఘం అధికారి ఎన్.శ్రీధర్ చిల్లేపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా ఉన్న రంగారెడ్డికి ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం సీఈఓ నాగరాజు ఉత్తర్వులు అందజేయగా రంగారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూలక సందీప్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ తలసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోతె పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా మార్చండి

● రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి

మోతె, ఫిబ్రవరి 7 : మోతె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా మార్చాలని ఎంపీపీ ముప్పాని ఆశ, జడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు అన్నారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోదాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉర్లుగొండ, రావిపహాడ్ గ్రామాల్లోని సబ్ సెంటర్లను 20 పడకల ఆస్పత్రులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేటి హలో బీసీ- చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

● బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సంపత్‌నాయుడు

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 7 : నేడు నిర్వహించే హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్‌నాయుడు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బీసీ విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నేటికి సమగ్ర కుల గణనపై తన వైఖరి వెల్లడించకుండా బీసీలపై వివక్షత చూపుతుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం సమగ్ర కుల గణనపై తమ రాజకీయ విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే బీసీల ధర్నా, 9న నిర్వహించే జాతీయ ఓబీసీ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ

నేరేడుచర్ల, ఫిబ్రవరి 7 : పట్టణంలోని చింతబండ ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మైక్ సెట్ బహూకరించారు. డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ బట్టు మధు, క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ కొణతం సీతారాంరెడ్డి రూ.4,500 వెచ్చించి మైక్‌సెట్‌ను కొనుగోలు చేసి పాఠశాల హెచ్‌ఎం గుంటి జ్యోతికి అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి జిలకర రామస్వామి, క్లబ్ ఉపాధ్యక్షుడు గుండా సత్యనారాయణ, సభ్యుడు విశ్వనాథం పాల్గొన్నారు.

జామెంట్రీ బాక్సులు, పెన్నులు అందజేత

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నె జడ్పీహెచ్‌ఎస్‌లో సుదీర్ఘంగా 27 ఏండ్ల పాటు ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేసిన సిరికొండ రాములు వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు పదో తరగతి విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, పెన్నులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎల్.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకవీడు ఎంపీడీఓగా దయాకర్ బాధ్యతలు

పాలకవీడు, ఫిబ్రవరి 7 : పాలకవీడు మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎ.దయాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పాలకవీడు ఎంపీడీఓగా పనిచేస్తున్న వెంకటాచారి పెన్‌పహాడ్‌కు బదిలీ కాగా ప్రస్తుతం మండలంలో ఎంపీఓగా పనిచేస్తున్న దయాకర్‌కు జిల్లా ఉన్నతాధికారులు ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు.

బైక్ ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గరిడేపల్లి, ఫిబ్రవరి 7 : మండలంలోని ఎల్‌బీనగర్ గ్రామం వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన బైక్ ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పానుగోడు గ్రామానికి చెందిన మిడిసినమెట్ల కృష్ణయ్య (51) మంగళవారం సాయంత్రం వ్యక్తిగత పనులపై నేరేడుచర్లకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎల్‌బీనగర్ గ్రామంలోని ఎన్ఎస్‌పీ కాల్వ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన మరో బైక్‌కు కృష్ణయ్య బైక్‌ను క్రాస్ చేసి ముందుకు వెళ్లి అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుకాల వస్తున్న కృష్ణయ్య నేరుగా ఆ బైక్‌ను ఢీకొట్టాడు. దాంతో కృష్ణయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డి తెలిపారు. కృష్ణయ్యకు కూతురు, కుమారుడు ఉన్నారు.

విద్యార్థులకు పెద్ద బాలశిక్ష పంపిణీ

నాగారం, ఫిబ్రవరి 7 : మండలంలోని ఫణిగిరి ప్రాథమిక పాఠశాలకు రిటైర్డ్ ఉపాధ్యాయుడ